శ్రీ ముద్దం నర్సింహ్మ యాదవ్ గారికి జన్మదిన శుభాకాంక్షలు...!

కేపీహెచ్‌బీ కాలనీ మొదటి రోడ్డులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ బాబురావు, అధికారులు

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 30: బాలాజీనగర్ డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం నియోజకవర్గం పరిధిలోని బాలాజీనగర్ డివిజన్ కేపీహెచ్‌బీ కాలనీ మొదటి రోడ్డులోని ధోభీఘాట్, నాయీ బ్రాహ్మణ సంఘం భవనంలో అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేపీహెచ్‌బీ కాలనీలో రజకులకు ధోభీఘాట్‌లో వసతులు కల్పించే దిశగా.. ధోభీఘాట్ అభివృద్ధి పనులను శ్రీకారం చూట్టినట్లు తెలిపారు. అత్యాధునిక హంగులతో ధోభీఘాట్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టగా.. ఆ పనులను ఆలస్యంగా సాగుతున్నాయన్నారు. అలాగే నాయీ బ్రాహ్మణ సంఘం భవనం అభివృద్ధి పనులు, పక్కనున్న వర్షనీటి కాలువకు ప్రహరీగోడ నిర్మాణ పనులు కూడా సాజవుగా సాగడం లేదని, ఆలస్యం కావడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయని, ఈ పనులన్నింటిని త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. కాలనీలో ఖాళీ స్థలాలన్నింటిని పార్కులుగా, క్రీడా ప్రాంగాణాలుగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఆయా ప్రాంతాలలో మిగిలిన పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, డీఈ శంకర్, ఏఈ శ్రీనివాస్, రజక, నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలో క్లీన్ క్యాంపస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి వీసీ బాలకృష్ణారెడ్డి, రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 30 : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతయని వర్సిటీ ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ వి.బాలకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలో నిర్వహించిన క్లీన్ క్యాంపస్ డ్రైవ్‌ను ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ వి.బాలకృష్ణారెడ్డి, రెక్టార్ విజయ్ కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, చీఫ్ ఇంజినీర్ వెంకటేశ్వర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ జీవీ.నర్సింహారెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శోభారాణి, ఆఫీసర్ పద్మావతి, వివిధ విభాగాల డైరెక్టర్‌లు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటరీలు పాల్గొన్నారు.

ప్రజావాణికి 24 ఫిర్యాదులు..

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 30: కూకట్‌పల్లి జోనల్, జంట సర్కిళ్ల కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 24 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో ప్రజావాణిలో 15 ఫిర్యాదులు రాగా.. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 9, ఇంజినీరింగ్ విభాగానికి 3, శానిటేషన్ విభాగానికి 2, ఉద్యానవనం విభాగానికి 1 ఫిర్యాదుల వచ్చినట్లు జడ్సీ అపూర్వ్ చౌహాన్ తెలపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి... ఆయా సమస్యలను పరిష్కరించడం జరుగుతుందనని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఈ చిన్నారెడ్డి, సీపీ గణపతి ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జంట సర్కిళ్ల కార్యాలయంలో..

కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 9 ఫిర్యాదులు వచ్చినట్లు డీసీలు గంగాధర్, వంశీకృష్ణ తెలిపారు. మూసాపేట సర్కిల్ కార్యాలయంలో 6 ఫిర్యాదులు రాగా.. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 5, ఎలక్ట్రికల్, శానిటేషన్ విభాగానికి 1 ఫిర్యాదు వచ్చిందన్నారు. కూకట్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో 3 ఫిర్యాదులు రాగా... రెవెన్యూ విభాగానికి 2 ఫిర్యాదులు, యూసీడీ విభాగానికి 1 ఫిర్యాదు వచ్చిందని తెలిపారు. ఆయా ఫిర్యాదులను సంబంధిత విభాగాలకు పంపడం జరిగిందని, ఆయా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజావాణి వినతులపై తక్షణ చర్యలు

మియాపూర్: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అందించే వినతులు ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకుంటామని చందానగర్ సర్కిల్ డీసీ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. చందానగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 2, పట్టణ ప్రణాళిక, శానిటేషన్, రెవెన్యూ విభాగానికి సంబంధించి ఒక్కొక్కటి చొప్పున మొత్తం 5 వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగిరెడ్డి, టీపీఎస్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ కార్తీక్ సహా ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు ఆవరణలో చెత్తను వేరు చేసేలా..

దీప్తిశ్రీనగర్‌లోని డంపింగ్ యార్డు ఆవరణలో చెత్తను వేరు చేసే ప్రక్రియకు అనుమతించాలని కోరుతూ స్వచ్ఛ ఆటో వాలాలు పెద్ద ఎత్తున సర్కిల్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఇండ్ల వద్ద తడి పొడి చెత్తను వేరు చేయటం సాధ్యం కావటం లేదని, డంప్ యార్డు వద్దే చేసుకోనివ్వాలని ఆటోవాలాలు డీసీ మోహన్‌రెడ్డిని కోరారు.

ఏఎంసీ సుధీర్‌కు నివాళి..

చందానగర్ సర్కిల్ కార్యాలయంలో రెవెన్యూ విభాగంలో ఏఎంసీగా పని చేసి.. ఇటీవలే జూబ్లీహిల్స్‌కు బదిలీపై వెళ్లిన సుధీర్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు ఆయన మృతికి ఇక్కడి సర్కిల్ కార్యాలయంలో సంతాపం వ్యక్తం చేశారు. సుధీర్ చిత్ర పటం వద్ద పూలు సమర్పించి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో డీసీ మోహన్‌రెడ్డి, ఏసీపీ నాగిరెడ్డి, ఏఎంసీ కృష్ణ, విజయ్‌కుమార్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సులు పునరుద్ధరించుకోవాలి..

చందానగర్ సర్కిల్ వ్యాప్తంగా ట్రేడ్ లైసెన్సులను మంగళవారం సాయంత్రంలోగా పునరుద్ధరించుకోవాలని డీసీ మోహన్‌రెడ్డి తెలిపారు. గడువులోగా వాటిని పునరుద్ధరించుకోకుండా వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందితో లైసెన్సుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని డీసీ మోహన్‌రెడ్డి సూచించారు.

వినతులు స్వీకరించి.. చర్యలు తీసుకోవాలని..

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్-గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయంలో సోమవారం ప్రజావాణిలో ప్రజల నుంచి వెలువడిన ఫిర్యాదులపై డీసీలు మల్లారెడ్డి, నర్సింహ సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయా విభాగాల అధికారులతో చర్చించి, వాటి పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించగా జంట సర్కిళ్ల పరిధిలో 10 సమస్యలపై ఫిర్యాదులు అందిన్నట్లు అధికారులు తెలిపారు.

భవన నిర్మాణ అనుమతుల్లో జాప్యం..

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలో భవన నిర్మాణ అనుమతుల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతున్నదని స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తెలిపారు. ప్రజావాణిని పురస్కరించుకుని ప్రధాన కార్యాలయంలో బల్దియా సీసీపీ శ్రీనివాస్‌ని కలిసి వినతిపత్రం సమర్పించారు.

జగద్గిరిగుట్టలో సమస్యలపై జోనల్ కమిషనర్‌కు వినతి

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్టలో పలు అభివృద్ధి నిర్మాణాలతో పాటు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆయా సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ఆయా పార్టీల నేతలు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందించారు. జగద్గిరిగుట్టలో యాదవ సంఘం భవనం నిర్మించాలని, సబ్‌స్టేషన్ నుంచి గుబురుగుట్ట శ్మశానవాటిక నుంచి వెంకటరామ్‌రెడ్డి నగర్ వరకు రింగ్ రోడ్ ఏర్పాటు చేయాలని, సిద్ధివినాయకనగర్‌లో 10,180 గజాల పార్క్ స్థలాన్ని ఆర్‌కే ట్రాన్స్‌పోర్ట్ అక్రమంగా బస్సులు నిలుపుతున్నారని, దానిని పార్కుగా మరమ్మతులు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి మల్లారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్, దారం సాయికుమార్, లక్ష్మినారాయణ, శ్రీనివాస్‌గౌడ్, రాజుయాదవ్, జగన్, జగద్గిరిగుట్ట బస్తీ అధ్యక్షుడు భిక్షపతి, బస్తీ ప్రధాన కార్యదర్శి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై కార్మికులకు అవగాహన

దుండిగల్, డిసెంబర్ 30: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్, షీ టీం ఆధ్వర్యంలో సోమవారం దుండిగల్ మున్సిపాలిటీ బహదూర్‌పల్లిలోని కార్తికేయనగర్‌లో భవన నిర్మాణ కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ షీ టీం ఏఎస్ఐ సాయిలుతో పాటు పలువురు సభ్యులు పాల్గొని ఫోన్‌లో వచ్చే ఫేక్ కాల్స్ గురించి, ఓటీపీ చెప్పడం వల్ల అకౌంట్‌లో డబ్బులు పోగొట్టుకునే ప్రమాదం గురించి, సైబర్ నేరాలు అలాగే మహిళలు, చిన్నారులపై జరిగే లైంగిక వేధింపులపై వివరించారు. అటువంటి సమయంలో బయపడకుండా పోలీసులకు 100కు, అలాగే షీటీం, సైబర్ క్రైమ్ గురించి 1930 నంబర్‌లను సంప్రదిస్తే.. పోలీసులు బాధితులకు న్యాయం చేస్తారని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు గొట్టుముక్కల సత్యనారాయణరాజు (సత్తిబాబు) కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

బాలానగర్, డిసెంబర్ 30: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించేది లేదని బాలానగర్ ఏసీపీ హనుమంతరావు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం తన కార్యాలయం వద్ద బాలానగర్ పీఎస్ పరిధిలోని రౌడీషీటర్లకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాత సంవత్సరానికి వీడ్కోలు పలకడం, న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా పీఎస్ పరిధిలో ఎలాంటి గొడవలు జరుగకుండ ఉండేందుకు తన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాత రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెట్టినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

అన్నదానం..

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 30: కొంపల్లి జయభేరిపార్క్ కాలనీలో మహాదేవ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవతి అమావాస్యను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి హాజరైన కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, ట్రస్ట్ కమిటీ సభ్యులు రాకేశ్‌రెడ్డి, కొండపల్లి రాకేశ్, సాయిరాజ్, రవి కాంత్‌రెడ్డి, మాధవరావు, గంగారెడ్డి శేఖర్, గోపాల్‌రెడ్డి తదితరులు.

షాపులు తొలగించొద్దు

జగద్గిరిగుట్ట, డిసెంబర్ 30: జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్ప సమీపంలో పేదల దుకాణాలు తొలగించవద్దని పలువురు కోరారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. పేదల వ్యాపారాలు చేసే ప్రాంతంలో ప్రహరీ పనులు చేపట్టవద్దని కోరారు. మహేశ్, నాగబూషణం, వెంకటేశ్, ప్రభాకర్, అంజయ్య పాల్గొన్నారు.

అయ్యప్ప పడి పూజ..

బాలానగర్, డిసెంబర్ 30: బాలానగర్ డివిజన్‌లో అయ్యప్ప మహాపడి పూజ ఘనంగా జరిగింది. సోమవారం రాజుకాలనీ రోడ్డులో నిర్వహించిన పడిపూజ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఆద్యాత్మిక శోభ ఉట్టిపడింది.



జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ జీవీ.నర్సింహారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘం నేతలు

సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని వినతి

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 30: యూజీసీ నెట్ పరీక్షల తేదీల్లో ఉన్నటువంటి సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళశాల ప్రిన్సిపాల్ జీవీ.నర్సింహారెడ్డికి వర్సిటీ ప్రొటెక్షన్ ఫోర్స్ విద్యార్థి సంఘం నేతలు వినతిపత్రం అందించారు. జనవరి 7 నుంచి 9వ తేదీ వరకు యూజీసీ నెట్ పరీక్షలు ఉన్నందున.. ఆయా తేదీల్లో ఎంటెక్ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలన్నారు. విద్యార్థులు ఆయా పరీక్షల కోసం.. యేడాదంతా కష్టపడి సిద్ధమయ్యారని, ఒకే రోజున రెండు పరీక్షలు రాయడం విద్యార్థులకు కష్టంగా ఉంటుందన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. కార్యక్రమంలో రాహుల్‌నాయక్, చంద్రశేఖర్, అర్జున్‌గౌడ్, సాయికుమార్, జవాజీ దిలీప్, రోహిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాల ఏర్పాటు అభినందనీయం

బాలానగర్, డిసెంబర్ 30: సేవా దృక్పథంతో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. సోమవారం ఇందిరాగాంధీపురంలో రాయ్ ఆఫ్ జాయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం ద్వారా నిరుపేదలకు వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు అవుతుందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాకీర్, గౌస్, అన్వర్, ఛౌకత్, కౌసర్, అఫ్జల్, బద్రి శంకర్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పేషెంట్‌కు ఆర్థిక సహాయం అందజేత

అల్లాపూర్, డిసెంబర్ 30: బ్లడ్ క్యాన్సర్‌తో ఆస్పత్రిలో బాధపడుతున్న వ్యక్తికి అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానందనగర్‌కు చెందిన ప్రముఖ సామాజిక వేత్త కెల్లా వెంకట్‌రావు తన మిత్రులతో కలిసి రూ.30 ఆర్థిక సహాయం అందజేశారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

దుండిగల్, డిసెంబర్ 30: భారత రాజ్యాంగ నిర్మాత డా,బీఆర్.అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని, దేశ ప్రజలకు అమిత్‌షా బహిరంగ క్షమాపణ చెప్పాలని సీపీఐ, సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. సీపీఐ, సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కమిటీల ఆధ్వర్యంలో సోమవారం షాపూర్‌నగర్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా షాపూర్‌నగర్ రైతు బజార్ నుంచి ఉషోదయ టవర్స్ వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. అమిత్‌షా ఖబడ్దార్, భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం, మతోన్మాదం నశించాలి అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకానీ లక్ష్మణ్ అధ్యక్షత వహించగా, సీపీఎం జిల్లా కార్యదర్శి పీ.సత్యం, సీపీఐ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి ఉమా మహేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డా,బీఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా కేంద్ర హోంమంత్రి పదవికి రాజీనామా చేయాలని.. అదే విధంగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు రావుల స్వాతి, ఈ.దేవదానం, డి.కరుణాకర్, కే.శీను, తిమ్మప్ప, భాష, సీపీఐ మండల నాయకులు నరసింహారెడ్డి, రాము చంద్రకాంత్, బోనాల కనకయ్య, గుర్రప్ప, సుంకిరెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.